ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 26.0


వేలేరుపాడు ఎన్‌టీఆర్ గ్రౌండ్‌లోకి చేరిన వరద

ముంచెత్తింది..


రుద్రమకోటలో వృద్ధురాలిని పడవ ద్వారా తరలింపు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాల్లోకి పోటెత్తిన వరద నీరు

- పెరుగుతూ..తగ్గుతున్న గోదావరి
- సురక్షిత ప్రాంతాలకు నిర్వాసితుల తరలింపు
- పోలవరం వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం

కుక్కునూరు/ వేలేరుపాడు/ పోలవరం/ఆచంట/ పెనుగొండ/యలమంచిలి/ నరసాపురం, జూలై 28: భద్రాచలం వద్ద శనివారం రాత్రి 8గంటలకు గోదావరి నీటిమట్టం 53 అడుగులు దాటడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై నెమ్మదిగా తగ్గుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు 51.07 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. సాయంత్రం 3 గంటలకు 49.70 అడుగులకు చేరుకోగా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల్లోకి వరదనీరు చొచ్చుకొచ్చింది. కుక్కు నూరులోని రజకుల వీధి, రామాలయం సెంటర్‌లో 10 ఇళ్లు నీట మునిగాయి. దాదాపు 25 కుటుంబాలను కుక్కునూరు 'ఏ'బ్లాక్ నుంచి చివ్వాక పునరావాస కాలనీకి తరలించారు. అమరవరం గోదావరి తీరంలో నివాసం ఉంటున్న జాలర్ల కుటుంబాలను బోట్ల ద్వారా పుల్లప్పగూడెం పునరావాస కాలనీకి తరలించారు. బెస్తగూడెంలో 34 కుటుంబాలను శనివారం అర్ధరాత్రి దాచారం పునరావాస కాలనీకి తరలించారు. కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు-బూర్గంపాడు, వింజరం వద్ద రహదారి నీటమునగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బోటుపైన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో పునరావాస కాలనీల్లో ఉంటున్న 480 కుటుంబాలకు రూ.3వేలు నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అధికారులు అందజేశారు. దాచారం పునరావాస కాలనీలో 250 మంది గొమ్ముగూడెం నిర్వాసితులు ఉంటున్నారు. లచ్చిగూడెంకు చెందిన 146 కుటుంబాలు సమీప గుట్టలపై వేసిన తాత్కాలిక గుడారాల్లో నివాసం ఉంటున్నారు. మండల ప్రత్యేకాధికారి బాబ్జీ ఆదివారం పునరావాస కాలనీలో బాధితులను పరామర్శించారు. కోమట్లగూడెం లో బాధితులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. వింజరం వద్ద రోడ్డుపైకి చేరిన వరద నీటిలో వాహనాలు వెళ్లకుండా అధి కారులు పహారా కాస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి గోదావరి నెమ్మదిగా తగ్గుముఖం పడుతోంది.

వేలేరుపాడులో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలం దిగువ భాగంలో ఉన్న కిన్నెరసాని, శబరి, వేలేరుపాడు మండలంలోని పెదవాగులు పోటెత్తడంతో వేలేరుపాడు మండల కేంద్రంతో సహా రుద్రమ్మకోట, రాపాక గొమ్ము, నాళ్ళవరం, చిగురుమామిడి, తిరుమలాపురం, తదితర గ్రామాల్లోకి వరదనీరు చొచ్చుకొచ్చి ఇళ్లను ముంచేసింది. వరద తీవ్రత అధికంగా ఉండడంతో శనివారం సాయంత్రానికే ఆయా గ్రామాల ప్రజలు ఊళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడంతో ఎలాంటి నష్టం లేకుండా బయటపడ్డారు. శబరి నదికి భారీగా వరద పోటెత్తడంతో ఆ ప్రభావం పూర్తిగా వేలేరుపాడు మండలంతో పాటు అల్లూరి జిల్లా కూనవరం, వీఆర్‌పురం మండలాలపై పడి గ్రామాలను ముంచివేసింది. వరద పరిస్థితిపై కలెక్టర్ వెట్రిసెల్వి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తుండడంతో అధికారులు సహాయక కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.





వేలేరుపాడు మండలం రుద్రమకోటలో ఇళ్లను ముంచిన గోదావరి వరద

మరోవైపు పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.757 మీటర్లకు చేరుకోగా 12,53,682 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్టు నీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 25.67 మీటర్లకు చేరుకుందని, 14,83,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉన్నట్టు ధవళేశ్వరం బ్యారేజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమేష్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 13,06,267 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ మల్లికార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం పెరగడంతో పోలవరం ప్రాజెక్టుకి వెళ్లే ప్రధాన మార్గమైన కడెమ్మ వంతెన నీట మునిగి వంతెనపై మూడడుగుల ఎత్తున వరద జలాలు ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుకి రాకపోకలు బంద్ కావడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండవాగుల జలాలు కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి వేగంగా గోదావరిలోకి ప్రవహించడానికి వీలుగా 23 స్లూయిజ్ గేట్లు పూర్తిగా ఎత్తి జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు.

గోదావరి రేవుల వద్ద పోలీస్ బందోబస్తు

పోలవరం మండలంలో గూటాల ఇసుక ర్యాంపు , పట్టిసీమ ఫెర్రి రేవు, పోలవరంలో యడ్లగూడెం కడమ్మ ఎత్తిపోతల పథకం రేవు వద ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగు ప్రాంతాల్లో రెండు షిఫ్టులుగా 8 మంది సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నదీ తీరాల వద్ద, పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద ప్రమాదకరంగా కోతకు గురైన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు ముంపు గ్రామాల్లో ముంపు బాధితులకు సహాయక చర్యలు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం గూటాల నుంచి ఆరు మరబోట్లను వాహనాలపై తరలించి నట్టు వీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు.


పోలవరం మండలం గూటాల నుంచి బోట్లను క్రేన్‌ల సహాయంతో తరలిస్తున్న దృశ్యం


కుక్కునూరు మండలం వింజరం వద్ద రహదారి పైకి చేరిన గోదావరి వరద


కుక్కునూరు మండలం బెస్తగూడెంలో శనివారం అర్ధరాత్రి ఇళ్లు ఖాళీ చేస్తున్న ప్రజలు

జల్లేరు జలాశయం నుంచి నీరు విడుదల

బుట్టాయగూడెం : మండలంలోని గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం నుంచి గేటును ఎత్తి ఆదివారం 300 క్యూసెక్కుల వరద నీటిని ఇరిగేషన్ అధికారులు దిగువకు విడుదల చేశారు. ఈ నెల 24న వరద ఉధృతి తగ్గడంతో అధికారులు గేట్లను మూసివేశారు. జలాశయానికి ఇన్‌ఫ్లో 231 క్యూసెక్కులు వస్తుండడంతో జలాశయంలో నీటిమట్టం 215.85 మీటర్లకు చేరుకుంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈలు సురేష్, తులసి తెలిపారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 28 : గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా బుట్టాయిగూడెం మండలంలో 34.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 13.8 మి.మీ నమోదైంది. టి.నరసాపురం 32.2, కొయ్యలగూడెం 30.2, నిడమర్రు 24.6, చింతలపూడి 23, కామవరపుకోట 22.6, లింగపాలెం 17.2, పెదవేగి 17, జంగారెడ్డిగూడెం 15.8, చాట్రాయి 15.2, ద్వారకా తిరుమల 14, భీమడోలు 12.4, ముదినేపల్లి 12.2, పెదపాడు 11.4, జీలుగుమిల్లి 10.6, నూజివీడు 10.4, ఉంగుటూరు 10.4, వేలేరుపాడు 9.6, ఏలూరు అర్బన్ 9.2, ఏలూరు రూరల్ 8.2, కైకలూరు 8.2, మండవల్లి 7.6, కుక్కునూరు 6.2, ఆగిరిపల్లి 6.2, కలిదిండి 5.4, పోలవరం 5.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన మండలా ల్లో 5 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

లంక గ్రామాల్లో ఆందోళన

పశ్చిమ గోదావరి జిల్లాలో వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో గంట గంటకు ప్రవాహం పెరుగుతోంది. ఆచంట మండలంలోని అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రిమూల, పెదమల్లం లంక, పల్లిపాలెం లంక గ్రామాలు నీట మునిగాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోకి వరద నీరు చేరింది. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో వరద నీరు ఇళ్ల చుట్టూ చేరింది. యలమంచిలి లంక, బాడవ ప్రధాన రహదారి, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, పల్లిపాలెం ప్రాంతాలు నీట మునిగాయి. బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం, గంగడపా లెం, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక గ్రామాల్లో ఏటిగట్టుకు లోపల కొబ్బరితోటలు జలమయం అయ్యాయి. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వరద జలాలు సముద్రంలోకి విడిచిపెట్టడంతో నీటమట్టం గంట గంటకు పెరుగుతోంది. ఇప్పటికే పిండాల రేవు, బాపు ఘాట్, వలంధర్‌రేవు నీట మునిగాయి. పట్టణంలోని పొన్నపల్లి, నందమూరి కాలనీ, లాకుపేట కాలనీల్లోకి నీళ్లు చేరాయి. ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాల్వ పొంగి లాకుపేటలోకి చేరింది. గోదావరి పరీవాహక ప్రాంతంలోని కాలనీల్లోకి నీరు చేరింది. మండలంలోని కొత్త, పాత నవరసపురం గ్రామాల్లోకి వరద పోటెత్తింది. ఈ రెండు గ్రామా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కూలిన ఇళ్లు..చెదిరిన బతుకులు

- దయనీయంగా కుక్కునూరు 'ఏ' బ్లాక్ నిర్వాసితుల జీవితం
- నేలమట్టమైన ఇళ్లకు వెళ్లలేక రెండేళ్లుగా పునరావాస కాలనీలోనే నివాసం
- ఆదుకుంటామని హామీ ఇచ్చి విస్మరించిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపై నిర్వాసితులు ఎన్నో ఆశలు


కుక్కునూరు, జూలై 28 : అటూ పోలవరం ప్రాజెక్టు ఇటూ ఎటా ముంచెత్తుతున్న గోదావరి. వరద ముంపునకు కూలిన ఇళ్లకు వెళ్లలేక గత వైసీపీ ప్రభుత్వం ఇస్తానన్న పునరావాస పరిహారం అందక రెండేళ్లుగా పునరావాస కాలనీల్లో పరిహారం కోసం ఎదురు చూస్తూ చెదిరిన బతుకులతో జీవచ్ఛవాల్లా కుక్కునూరు 'ఏ'బ్లాక్ నిర్వాసితులు కాలం గడుపుతున్నారు. నెలలు, సంవత్సరాలు గడుస్తున్న పరిహారం అందక ఎదుగొచ్చిన ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయలేక, ఒక వేళ చేసినా ఇస్తానన్న కట్నం ఇవ్వకపోవడంతో కొందరు ఆడపిల్లలు పుట్టింటికి చేరుతుండడంతో కన్నీటి పర్యంతమవుతున్నాయి నిర్వాసిత కుటుంబాలు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి ఎన్నో కుటుంబాల్లో కనిపిస్తోంది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో 41.15 కాంటూరు లెవెల్‌లో కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలు ఉన్నాయి. అందులో కుక్కునూరు 'ఏ'బ్లాక్ ఒకటి. 16 జూలై 2022లో 71.3 అడుగుల గోదావరి నీటిమట్టం నమోదు కావడంతో ఎన్నో గ్రామాల్లో ప్రజలు కకావికలం అయ్యారు. అందులో కుక్కునూరు 'ఏ'బ్లాక్ ఒకటి దాదాపు రెండు నెలల వ్యవధిలో నాలుగు సార్లు గోదావరి ముంచెత్తడంతో 'ఏ'బ్లాక్ నిర్వాసితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిపోయారు. వీరంతా కివ్వాక పునరావాస కాలనీలో 2022 గోదావరి ముంపు వచ్చిన సమయంలో తలదాచుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్లుగా దాదాపుగా 100కు పైగా కుటుంబాలు కివ్వాక పునరావాస కాలనీలోనే ఉన్నాయి. వీరిలో 90 శాతం మందికి కూలిపనులే జీవనాధారం. కూలిన ఇళ్లు తిరిగి నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేక పరిహారం ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. వ్యక్తిగత పునరావాసం, ఇళ్లకు పరిహారం చెల్లించి తమకు తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెంలో నిర్మిస్తున్న పునరావాస కాలనీకి తరలించాలని నిర్వాసితులు పదేపదే వేడుకుంటున్నారు. అయితే గత జగన్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడమే తప్ప వారికి చేసిందేమీలేదు. కొత్తగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వచ్చింది. శనివారం రాష్ట్ర మంత్రులు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించారు. నిర్వాసితులకు అండగా ఉంటామని వారికి అన్ని రకాలుగా ప్యాకేజీలు అందించి పునరావాస కాలనీలకు తరలిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో ఈ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని కుక్కునూరు 'ఏ'బ్లాక్‌తో నిర్వాసితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


2022 గోదావరి వరదలకు కుక్కునూరులో నీటమునిగిన గుడిసెలు (ఫైల్)


కుక్కునూరు 'ఏ'బ్లాక్‌లో ఆదివారం ఓ ఇంటిని చుట్టుముట్టిన వరదనీరు

కూలికి వెళ్తేనే పొట్ట గడిచేది



నా ఇల్లు కూలడంతో రెండేళ్లుగా పునరావాస కాలనీలో ఉంటున్నాను. పాత ఇంటి దగ్గర నా చేతివృత్తి ద్వారా అయినా ఎంతోకొంత సంపాదించుకునేవాణ్ని. ఇక్కడ పని దొరకడంలేదు. జీవనం కష్టంగా సాగుతోంది.

- ఎండీ పుల్లా, 'ఏ'బ్లాక్ నిర్వాసితుడు

ఇల్లు నిర్మించుకునే స్తోమత లేదు



2022 గోదావరి వరదలకు నా ఇల్లు కూలింది. సామాన్లు కొట్టుకుపోయాయి. తిరిగి ఇల్లు నిర్మించుకునే స్తోమత లేదు. అప్పటి నుంచి పునరావాస కాలనీలోనే ఉంటున్నాం. పరిహారం చెల్లించండి.

- ఎండీ దస్తగిరి, 'ఏ'బ్లాక్ నిర్వాసితుడు

మా కష్టాలు చెప్పుకుంటే తీరేవికావు



ఇళ్ళు కూలగానే అధికారులు వచ్చారు. పరిహారం చెల్లించి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వం అయినా మా బాధలు అర్థం చేసుకుని మాకు పరిహారం ఇవ్వాలి.

- ఎస్‌కే మహబూబి, 'ఏ'బ్లాక్ నిర్వాసితురాలు

రెండు రోజులు దర్జాగా ఉన్నాడు..

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మరోసారి బయటపడిన సెక్యూరిటీ లోపం

నూజివీడు టౌన్, జూలై 28: నూజివీడు ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ లోపం మరోసారి బయటపడింది. ఇటీవల విద్యార్థులకు మద్యం సరఫరా అయిన ఘటన మరువక ముందే గ్రాండ్ రీ రెమిడియల్ పరీక్షకు వచ్చిన విద్యార్థినితో ఆమె స్నేహితుడు కూడా క్యాంపస్‌లో రెండ్రోజులు అనుమతి లేకుండా ఉండడం చర్చనీయాంశమైంది. ఆర్‌జీయుకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు యూనివర్సిటీ మరోసారి అవకాశం ఇచ్చింది. ఇందుకు సంబంధించి మొత్తం 499 మంది విద్యార్థులు ఈ నెల 22 నుంచి రీ రెమిడియల్ పరీక్షలను రాస్తున్నారు. ఈ క్రమంలోనే ఆర్‌కే వ్యాలీకి చెందిన పీయూసీ తృతీయ సంవత్సరం విద్యార్థిని పరీక్ష రాసేందుకు నూజివీడు వచ్చింది. ఆమెతో పాటు అక్కడే చదువుతున్న ఆమె స్నేహితుడు సైతం నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు రావడం, క్యాంపస్‌లో రెండ్రోజుల పాటు ఉన్నాడు. అయితే ఈ రెండ్రోజుల్లో అసలు ఆ విద్యార్థి ఎవరు? ఎందుకు వచ్చాడు? అనేది ఎవ్వరూ గుర్తించలేదు. క్యాంపస్‌లోనే భోజనం ఇతర సదుపాయాలు పొందిన అతను ఆదివారం క్యాంపస్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తూ సెక్యూరిటీ సిబ్బందికి చిక్కాడు. దీంతో అతన్ని ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులకు అప్పగించారు. ఆ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారిని పిలిపించి మాట్లాడి చర్యలు తీసుకుంటామని నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏవో చంద్రశేఖర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

తెల్లారిన బతుకులు

ముగ్గురు కుమారుల మృతి.. తల్లి పరిస్థితి విషమం

- కాకినాడ జిల్లా మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం !
- భీమవరం మండలం తాడేరు గ్రామస్థుల దుర్మరణం

-7లో

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు

- హెల్మెట్ ధరించాలని కౌన్సెలింగ్

ఏలూరు క్రైం, జూలై 28 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు అధికారులు ఆదివారం సాయంత్రం విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో ఆదివారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ వల్ల ప్రాణరక్షణ ఉంటుందని ప్రతి ఒక్కరు విషయం గ్రహించాలన్నారు. వేగంగా వాహనం నడపడం వల్ల వాహన వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలన్నారు. మోటారు సైకిళ్లకు అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లు ఉపయోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపేవారికి ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని వాహనాలకు ఇన్సూరెన్సు, సీ బుక్కు, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని సూచించారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు


ఆర్డీవో ఖాజావలీ

ఏలూరు రూరల్/భీమవరం ఎడ్యుకేషన్, జూలై 28:ఏలూరులో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 101 మంది అభ్యర్థులు హాజరు అయ్యారని ఏలూరు ఆర్డీవో ఎస్.ఎస్.కె ఖాజావలీ తెలిపారు. డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఏలూరు జిల్లాలోని ఏలూరు సిద్ధార్థ ఫెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో ఆగస్టు రెండో తేదీ వరకు జరుగుతాయన్నారు. తొలిరోజు ఉదయం జరిగిన పరీక్షల్లో 119 మంది అభ్యర్థులకు 101 మంది హాజరు అయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 132 మంది అభ్యర్థులకు 108 మంది హాజరయ్యారన్నారు. పశ్చిమ గోదావరి జిలా భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ అటానమస్ పరీక్ష కేంద్రంలో 90 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 78 మంది పరీక్షకు హాజరై 12 మంది గైర్హాజరయ్యారు.


బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్ల క్రీడాకారులు

ఉమ్మడి పశ్చిమ జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

వీరవాసరం, (భీమవరంటౌన్), జూలై 28:వీరవాసరంలోని మద్దాల రామ కృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి పశ్చిమ జిల్లా పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలో పలు ప్రాంతాల నుంచి 30 మంది మహిళలు 40 మంది పురుషులు పాల్గొన్నారని పశ్చిమ గోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహాయక కార్యదర్శి పి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు తెలిపారు.

మహిళా జట్టు.. బి.సౌమ్యశ్రీ (తణుకు), సీహెచ్.మానస (మాముదురు), ఎం.మరియ (పి.ఎం.లంక), ఎస్.గౌరి (శ్రీవాసవికాలేజ్, తాడేపల్లి గూడెం), గులిపల్లి స్వాతి (వీరవాసరం), కె.రాజశ్రీ (శ్రీవాసవి కాలేజ్, తాడేపల్లి గూడెం), స్టాండ్ బై.. ఎ.అంజలీదేవి (భీమవరం), జి.ఉమాదేవి (నరసాపురం) ఎంపికైయ్యారు.

పురుషుల జట్టు.. ఎస్.సాగర్ (మండపాక), డి.విల్సన్ (గునుపూడి), పి.అనోజ్ (గునుపూడి), ఎ.ఆనంద్(భీమవరం), పి.ఫణి(వీరవాసరం), ఎం.దుర్గారావు (ఉండి) ఎంపికయ్యారు. ఎంపికైన ఇరు జట్లు నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, ఇందుకూరి పేటలో వచ్చేనెల 2,3 తేదీల్లో జరగనున్న 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపికలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు బాజింకి శ్రీనివాసరావు, మహ్మద్ ఖుద్దుస్, కె.కృష్ణారెడ్డి, బి. జాన్సన్, బాజింకి గంగామహేష్ ఉన్నారు.

'పశ్చిమ'లో 15,301 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

»» ముంపు నష్టంపై మంత్రులకు వివరించిన మార్టేరు శాస్త్రవేత్తలు

పెనుమంట్ర, జూలై 28 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటివరకు నమోదైన అంచనా ప్రకారం మొత్తం 1422 ఎకరాల్లో నారుమళ్లు, 15,301 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ టి.శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా ఉభయగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్న మంత్రుల పర్యటనలో భాగంగా తణుకు నగరపాలక కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం వరి విస్తీర్ణం 2.39 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 1.08 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని, మిగిలిన విస్తీర్ణంలో నాట్లు వేయాల్సి ఉందన్నారు. తొలుత నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, తణుకు చుట్టుపక్కల గ్రామాల్లో పంట 25 నుంచి 40 రోజుల వయసు ఉండగా ఎర్రకాలువ ముంపు వల్ల చాలాచోట్ల పంట దెబ్బతిందన్నారు. పంట ఏడు రోజులకుపైగా నీట మునగడం వల్ల పంట కుళ్లిపోయే అవకాశం చాలా ఎక్కువ అన్నారు. స్వల్పకాలిక రకాలైన ఎంటీయూ 1010, 1156, 1153, 1293 లేదా పీఆర్ 126 వంటి రకాలను మళ్లీ వేసుకోవడం వల్ల పంటకాలం నష్టపోకుండా ఉండే అవకాశం ఉందన్నారు. రెండు, మూడు రోజుల ముంపునకు గురై నీరు లాగేసే పొలాల్లో త్వరగా నిలదొక్కుకోవడానికి 20 కిలోల పొటాష్, 15 కిలోల యూరియాను నీరు లాగేసిన తరువాత చేనుకు వేయాలని సూచించారు.


శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో యాత్రికుల రద్దీ

మార్మోగిన గోవింద నామస్మరణ

»» ఆలయానికి 15 వేల మందికిపైగా భక్తులు

ద్వారకాతిరుమల, జూలై 28: గోవిందా... గోవిందా అంటూ గోవిందుని నామాలతో శ్రీవారి క్షేతం మార్మోగింది. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత వెల్లువిరిసింది. ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చి వారు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీవారి సాధారణ దర్శనానికి రెండు గంటల పైబడి సమయం పట్టింది.


దాత కృష్ణంరాజు కుటుంబానికి బాండు అందిస్తున్న ఏఈవో దుర్గారావు


దాత వెంకటరత్నంకు బాండు అందచేస్తున్న ఈవో త్రినాథరావు

శ్రీవారి ట్రస్టుకు రూ.6.10 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, జూలై 28: చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా రూ.6.10లక్షలను విరాళంగా అందజేశారు. దీనిలో భాగంగా గుంటూరుకు చెందిన ఆలపాటి వెంకటరత్నం, శివనాగేంద్ర ప్రతీ రోజూ తమపేరున అన్నప్రసాద వితరణ జరపాలని రూ.5 లక్షలను డీడీ రూపేణా ఈవో త్రినాథరావుకు అందించారు. స్వామి వారి దర్శన అనంతరం ఆయనకు బాండును ఈవో అందజేశారు. కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన మంతెన అహోబల కృష్ణంరాజు రూ.1.10 లక్షలను అన్నప్రసాద ట్రస్టుకు విరళం ఇవ్వగా వీరి కుటుంబానికి ఏఈవో దుర్గారావు బాండును అందించారు.

అపస్మారక స్థితిలో హాస్టల్ బాలిక

»» అనుమానాస్పదంగా మిషనరీ హాస్టల్ వ్యవహారం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ హాస్టల్ బాలిక అపస్మారక స్థితిలో ఏరియా ఆసుపత్రికి ఆదివారం రాత్రి చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ బాలిక ఒంటి నిండా పసుపు రాసి స్పృహ లేకుండా ఉండడంతో ఆసుపత్రి వర్గాలు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాలికను ఆసుపత్రికి ఓ వ్యక్తి మహిళా కేర్ టేకర్ లేకుండా తీసుకురావడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తుంది. ఆ బాలిక ఉంగుటూరు ప్రాంతానికి చెందినదని, ప్రస్తుతం తాడేపల్లిగూడెం గార్ల్స్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నట్టు హాస్టల్ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో కూడా ఈ హాస్టల్‌లో ఓ బాలికపై లైంగిక వేధింపులు జరిగినట్టు పలు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెల్లారిన బతుకులు

ముగ్గురు కుమారుల మృతి.. తల్లి పరిస్థితి విషమం

- కాకినాడ జిల్లా మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం !
- తాడేరు గ్రామస్థుల దుర్మరణం


తల్లి దుర్గ

గండేపల్లి, జూలై 28: కూలి పనులు చేసుకుంటే కానీ పూటగడవని కుటుంబాన్ని మృత్యువు కబళించేసింది. కూలి పనులకు వెళ్లి తిరిగి సొంతూరుకు వస్తుండగా మృత్యువు గుర్తు తెలియని వాహన రూపంలో వచ్చి ముగ్గురినీ బలితీసుకోగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. వివరాలివి.. భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) సొంతూరులో ఉపాధి లేక అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా కుంతలం గ్రామానికి ఈనెల 17న ఉపాధి నిమిత్తం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లారు. అక్కడ పది రోజులపాటు పనిచేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30కు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్ బైక్‌పై బయలుదేరారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారునకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. అప్పటికే చినుకులు పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా గుర్తుతెలియని వాహనం వారి మీద నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ విషయం హైవే మొబైల్ సిబ్బంది రాముకు తెలియగానే గండేపల్లి ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందించారు. హుటాహుటిన సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన దుర్గను 108లో రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి ప్రమాద ఘటనపై సమాచారం సేకరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృతి చెందడంతో ఆ దారిలో వెళ్లేవారిని సైతం కంటతడి పెట్టించింది.

ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నాం : జగ్గంపేట సీఐ లక్ష్మణరావు

ఈ ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ వేగవంతం చేశాం. పల్సర్ బైక్ వర్షానికి అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండవచ్చు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. త్వరగా విచారణ చేసి వాహనాన్ని పట్టుకుంటామని, జాతీయరహదారి వెంబడి సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు.


తాడేరులో బాధితుల ఇల్లు


మృతుల ఇంటి వద్ద స్థానికులు, బంధువులు

చేతికి అందిన మనుమలు ఇక లేరు



ఈ వయస్సులో ఇలాంటి సంఘటన చోటుచేసుకుంది. చేతికి వచ్చిన మన వళ్ళు ముగ్గురు చనిపోవటం మా కుటుంబాన్ని కుంగిపోయాలే చేసింది. మాకు ఆదరించే వారు లేకుండా పోయారు.

\- కృష్ణమూర్తి, తాత

ఇంటికోసం ఎంతో కష్టపడతారు



పిల్లలు చదువులు మానేసి కష్టపడడం మొదులు పెట్టారు. ఇల్లు కట్టుకోవాలని కుటుంబంఅంతా దురప్రాంతం వెళ్ళి మరి కష్టపడేవారు. పిల్లలు ముగ్గురు మరణించడం ఎంతో బాధగా ఉంది. ఈ మధ్యనే వారికి ప్రభుత్వం ఇంటి స్థలం కూడా ఇచ్చింది.

\- పాపాయమ్మ, చిన నానమ్మ

తాడేరులో విషాదం

భీమవరం రూరల్, జూలై 28: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారులో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమారులు, వారి తల్లికి గాయాలైన ఘటనతో భీమవరం రూరల్ తాడేరులో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన నంగలం కోటయ్య కుటుంబం కాయకష్టాన్ని నమ్ముకుంది. ఎక్కువగా తాపీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. 365 రోజుల పాటు ఎక్కడ ఏపని ఉన్నా ఆ కుటుంబం వెళ్లిపోతోంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లి పది రోజుల అనంతరం శనివారం రాత్రి తాడేరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈసారి కోటయ్య మినహా భార్య దుర్గ, ముగ్గురు కుమారులు నర్సీపట్నం వెళ్లారు. రెప్పపాటులో తనువు చాలించారు. కోటయ్య భార్య దుర్గ గాయాలపాలైంది. ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోతున్నారు. చిన్నకుమారుడు అఖిల్ భీమవరంలోని గునుపూడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను పని వద్దకు తీసుకుపోతుంటారు. ఈసారి పాఠశాలకు వెళ్లకుండా అఖిల్ తన తల్లి దుర్గతో నర్సీపట్నం వెళ్లి ప్రమాదంలో దుర్మరణం పొందాడు. తల్లిదండ్రులు కోటయ్య, దుర్గలకు తీరని కడుపుకోత మిగిలింది. పాఠశాలకు వెళ్లి ఉంటే అఖిల్ ప్రాణాలతో మిగిలేవాడంటూ తాతయ్య నంగలం కృష్ణమూర్తి కన్నీటి పర్యంత మవుతున్నారు.

కుటుంబం లేకుండా పోయింది..



అనుకోని సంఘటనతో కుటుంబం చిన్నాభిన్నమైంది. ఈ ప్రమాదంతో కుటుంబం అనేది లేకుండాపోయింది. జీవితం ఎలా గడుస్తుందో తెలియడం లేదు. ఉపాధికోసం కుంటుంబం అంతా దూరప్రాంతాలకు వెళ్లి పని చేసుకుని వచ్చే వాళ్లం. ఈసారి వారు వెళ్లారు.. నేను ఇక్కడే ఉండిపోయాను.

\- కోటయ్య, మృతుల తండ్రి

క్రైం కార్నర్

డ్రైవర్ నిద్రమత్తే ప్రాణం తీసింది..

»» కాల్వలోకి దూసుకెళ్లిన కారు.. మహిళ మృతి

»» డ్రైవర్, మృతురాలి కుమార్తెకు గాయాలు


బోల్తా పడిన కారు..


నాగమణి (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 28: డ్రైవర్ నిద్రమత్తుతో ఓ నిండు ప్రాణం బలిగొంది. తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్ద ఆదివారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో భీమవరానికి చెందిన పీతల నాగమణి(58) మృతి చెందగా డ్రైవర్, మృతురాలి కుమార్తె గాయాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరానికి చెందిన విశాలి సబ్ ట్రజరీ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తుంది. తన వ్యక్తిగత పనిమీద నిడదవోలు వెళ్లేందుకు ఆదివారం తెల్లవారుజామున బయల్దేరగా తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల వద్ద డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో ముందుగా వస్తున్న లారీని అకస్మాత్తుగా చూసి లారీని తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న బైక్ మెకానిక్ షెడ్‌లో నుంచి కాల్వలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో నాగమణి అక్కడికక్కడే మృతి చెందగా కారు డ్రైవర్, మృతురాలి కుమార్తె విశాలికి గాయాలయ్యాయి. వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాద సమయంలో రోడ్డుపక్కన మెకానిక్ షెడ్‌లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ దుర్గారావు తెలిపారు.

బిల్లిమిల్లిలో ఒకరి హత్య !

»» అనుమానాస్పద మృతిగా కేసు


వెంకటేష్ మృతదేహం

కొయ్యలగూడెం, జూలై 28: ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కొయ్యలగూడెం మండలం బిల్లిమిల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. సీఐ మధుబాబు, స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని సోదిం వెంకటేష్(49) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. శనివారం హత్యకు గురైన విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలాన్ని సీఐ వెళ్లి పరిశీలించారు. మృతుడి మెడపై గాయాలుండడంతో హత్యకు గురైనట్టు భావిస్తున్నారు. ఇద్దరు కుమారుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూలై 28 :మోటారు సైకిల్‌పై వెళుతున్న ఒక వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు చిరంజీవి బస్‌స్టాప్ ప్రాంతానికి చెందిన వల్లపు ఆనంద్(22)కు వివాహమైంది. ఆదివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో పోణంగి నుంచి తన ఇంటికి మోటారు సైకిల్‌పై వస్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రస్తుతం మృతుడి భార్య గర్భవతి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



దెందులూరు, జూలై 28 : గుండుగొలను సమీపంలో 16వ నంబరు జాతీరహదారిపై ఆదివారం ఓ మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. పేదవేగి మండలం దిబ్బగూడెం నుంచి ఆదివారం ఉదయం దంపతులిద్దరూ మోటార్‌సైకిల్‌పై వివాహానికి వెళ్తుండగా సత్యనారాయణపురం దాటిన తరువాత కారు గరుడ హోటల్ సమీపంలో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు వారిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో బైక్ నడిపిన యువకుడు

»» ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతి

»» మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 28 : మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై అతివేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌పై వెనుక కూర్చున్న తమ్ముడు మరణించగా, బైక్ నడుపుతున్న అన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. ముగ్గురు వస్తున్న బైక్‌లో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడానికి చెందిన చుండ్రు రమేష్ తన భార్యను, పిల్లలను భార్య పుట్టిల్లు అయిన పినకడిమిలో ఆదివారం సాయంత్రం తీసుకువచ్చి దించారు. తిరిగి ధర్మాజీగూడెం వెళ్తున్న రమేష్ చొదిమెళ్ళలో ఉన్న తన తమ్ముడు చుండ్రు ప్రవీణ్‌కుమార్ (25)ను ఎక్కించుకుని వెళుతున్నాడు. కొత్తూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అఖిల్ అనే యువకుడు అదే కాలనీకి చెందిన కనజం చిన్న, మరో యువకుడు కలిసి మోటారు సైకిల్‌పై విజయరాయి వద్దకు వెళ్లి అక్కడ మద్యం తాగి తిరిగి ఏలూరుకు అతి వేగంగా వస్తున్నారు. విజయరాయి దాటిన తరువాత ఎదురుగా వస్తున్న చుండ్రు రమేష్ ప్రవీణ్ కుమార్ ఉన్న బైక్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే బైక్ నడిపిన అఖిల్, మరో యువకుడు పారిపోయారు. కనిజం చిన్న గాయాలపాలయ్యాడు. మరో బైక్‌పై ఉన్న చుండ్రు రమేష్, ప్రవీణ్ తీవ్ర గాయాలు కాగా వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్‌కుమార్ మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు. రమేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. మరణించిన ప్రవీణ్‌కుమార్ కారు డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఈ ఘటనపై పెదవేగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

డ్రగ్స్ పంపించారంటూ వీడియో కాల్

»» ఆపై బెదిరింపులు.. వారం రోజుల్లో రూ.26 లక్షలు స్వాహా

»» పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఏలూరు క్రైం, జూలై 28 : ఏలూరు విద్యానగర్‌కు చెందిన పాము సెల్వరోజలిన్ భీమవరంలోని ఒక కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 18వ తేదీన ఆమెకు ముంబై నుంచి ఒక వీడియో కాల్ వచ్చింది. ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని ఆమె పేరు మీద విదేశాలకు ఐదు పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌లు, డ్రగ్స్ పంపిస్తున్నారని అవి సీబీఐ తనిఖీల్లో పట్టుబడ్డాయంటూ వీడియో కాల్ ద్వారా అక్కడ ఉన్న ప్యాకెట్లను చూపించి భయపెట్టారు. తాము చెప్పినట్లు చేస్తే కేసులు లేకుండా చేస్తామని లేదంటే అరెస్టు చేస్తామని ఎన్నో కేసులు ఎదుర్కొనాల్సి ఉంటుందని బెదిరించారు. ఈనెల 18 నుంచి 24వ తేదీ లోపు రెండు ఖాతాలకు రూ. 25,60,500లను వేయించుకున్నారు. అంతేకాకుండా ఆమెను హౌస్ అరెస్టు చేస్తున్నామని ఒక లెటర్ వాట్సాప్‌కు పంపించారు. ఎవరితోనూ ఫోన్ మాట్లాడకుండా ఉండాలని బెదిరించారు. చివరకు తాను మోసపోయానని భావించిన బాధితురాలు ఆదివారం సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థినిని కొట్టిన టీచర్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 28 :ఏలూరు సమీపంలో కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది ఎం.రవికుమార్ తమ కుమార్తెను ఏలూరులోని సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలులో ఐదో తరగతిలో చేర్పించాడు. ఈనెల 24న ఆ విద్యార్థిని హోమ్ వర్క్ చేయలేదని టీచర్ రాజ్యలక్ష్మి కొట్టారని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో అదేరోజు సాయంత్రం కుటుంబసభ్యులతో వెళ్లి ప్రిన్సిపాల్‌ను, టీచర్‌ను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారంటూ పేర్కొన్నారు. తన కుమార్తె హార్ట్ పేషెంటు అయినప్పటికీ కనికరం లేకుండా టీచర్ కొట్టి బెదిరించారంటూ అదే రోజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు త్రీటౌన్ పోలీసులు సదరు టీచర్ రాజ్యలక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● రవికుమార్‌పై కేసు నమోదు...

న్యాయవాది రవికుమార్ ఈనెల 24న సాయంత్రం సురేష్ చంద్ర పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలు ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి తన కుమార్తెను టీచర్ కొట్టారంటూ ఆమెను పిలిపించాలని కోరడంతో రాజ్యలక్ష్మి అనే టీచర్‌ను ప్రిన్సిపాల్ వెంపటి స్రవంతి పిలిపించారు. ఆ టీచర్‌ను, ప్రిన్సిపాల్‌ను కూడా అవమానకరంగా దుర్భాషలాడారని, దౌర్జన్యంగా భయభ్రాంతులకు గురి చేసే విధంగా న్యాయవాది ప్రవర్తించారంటూ ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.



మాట్లాడుతున్న ఆంధ్రా సుగర్స్ చైర్మన్ నరేంద్రనాథ్ చౌదరి


సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఘనంగా హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి వేడుకలు

తణుకు, జూలై 28 : దివంగత ఆంధ్రా సుగర్స్ చైర్మన్ డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా సుగర్స్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం పలుసేవా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. క్రమశిక్షణ, సమష్టికృషితో సంస్థ పంచదార తయారీ నుంచి అంతరిక్షయానానికి అవరమయ్యే ర్యాకెట్ ఇంధనం తయారీ వరకు అభివృద్ధి సాధించిందన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు 400మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో 25 ఏళ్ల పైబడిన ఒకే సంస్థలో సేవలందించిన వారిని గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎస్ రాజు, డాక్టర్ డి.మంజులత, పి.వెంకటేశ్వరరావు, జీఎస్‌వీ ప్రసాదు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్ళపూడి నరేంద్రనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పెండ్యాల ఎస్.ఆర్.వి.కె. రంగారావు, సంస్థ జనరల్ మేనేజర్ ఎ.. సాంబశివరావు తదితరులు ఉన్నారు. సన్మానం పొందిన వారిలో గొడపర్తి త్రినాథ్, ముళ్ళపూడి శ్రీనివాసు, చెరుకూరి నగేష్‌కుమార్, కళా వెంకటనాగరవికుమార్, మద్రాపు వెంకటేశ్వరరావుతో పాటు పలు సంస్థలు యూనిట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఒకే రేటు అమలు చేయాలి



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూలై 28: దేశ వ్యాప్తంగా ప్రతి వస్తువును ఒకే రేటుకు అమ్మేవిధంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక నేరెళ్ళ రాజా కల్యాణ మండపంలో అసోసియేషన్ స్థాపించి ముఫై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వేడుకలు, రాష్ట్రసదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహుళజాతి సంస్థల ఒంటెద్దు పోకడల కారణంగా దేశవ్యాప్తంగా ఆయా ఉత్పత్తుల డిస్ట్రిబ్యూటర్లకు గౌరవమర్యాదలు, భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల మధ్య సంతృప్తికరమైన వాతావరణాన్ని కేంద్రం తీసుకురావాల్సి ఉందన్నారు. మరో అతిథి ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటిని అసోసియేషన్ నాయకులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, కార్యదర్శి సత్యప్రకాష్, నాగేశ్వరరావు, సీహెచ్ రవికృష్ణ, గిరిధర్, పి.శ్రీనివాస్, ఎం.ప్రవీణ్, గురుప్రసాద్, నిమ్మల రాజశేఖర్ తదితరులు, ఇతర రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

లింగపాలెం/ఆకివీడు, జూలై 28: లింగపాలెం మండలం, ఆకివీడు మండలంలో మొత్తం 12 మంది జూదరులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని లింగపాలెం ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1200 నగదు,పేక ముక్కలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆకివీడు మండలం అయి-భీమవరం రోడ్‌లోని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని రూ.43,360 స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేశామని ఎస్‌ఐ బత్తిన నాగబాబు ఆదివారం తెలిపారు

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

»» రక్షించిన మత్స్యకారులు, పోలీసులు

నరసాపురం, జూలై 28 : వరదతో ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ఠ గోదావరిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని పోలీసులు, స్థానిక మత్స్యకారులు ఆదివారం ప్రాణాలను కాపాడారు. దాదాపు అరగంట పాటు ఉత్కంఠంగా సాగిన ఈ సాహసంలో చివరికి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ప్రాణాలతో బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన 30 ఏళ్ల వయసు గల కె.కృష్ణ కుటుంబ కలహాలతో సాయంత్రం ఆరు గంటల సమయంలో అమరేశ్వరస్వామి గుడివద్ద గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉగ్రరూపం దాల్చిన గోదావరి వేగంగా ప్రవహిస్తుండడంతో క్షణాల్లో కొట్టుకుపోవడాన్ని స్థానిక మత్స్యకారులు రేవుల్లో విధుల్లో ఉన్న పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో వరదను తిలకించేందుకు వచ్చిన వందలాదిమంది అతడిని చూసి కేకలు వేశారు. వెంటనే గట్టుపై ఉన్న మత్స్యకారులు, పోలీసులు అమరేశ్వరస్వామి రేవులో ఉన్న పడవలపై కొట్టుకుపోతున్న అతడి వెనుక వెళ్లారు. గోదావరిలో కిలో మీటరు దూరం వెళ్ళిన తరువాత అతడిని పట్టుకుని పడవలో ఎక్కించి ఒడ్డుకు చేర్చారు. ప్రాథమిక చికిత్స చేసి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాహసించిన మత్స్యఆరులు, పోలీసులను స్థానికులు అభినందించారు.


గోదావరిలోకి దూకిన వ్యక్తిని రక్షించేందుకు మత్స్యకారుల గాలింపు.. రక్షించిన దృశ్యం

ఢిల్లీ దర్గాలో మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు



ఢిల్లీలో వున్న చంద్రబాబుకు చాదర్, ప్రసాదాలను అందిస్తున్న టీడీపీ ఎంపీ, నేతలు

ద్వారకాతిరుమల, జూలై 28: ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ దర్గాలో మొక్కు చెల్లించిన గోపాలపురం నియోజకవర్గ టీడీపీ నేతలు అక్కడ వున్న సీఎం చంద్రబాబును కలిసి చాదర్‌ను, ప్రసాదాలను అందించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో ఉంచిన సమయంలో ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో బయటకు వచ్చి తిరిగి ముఖ్యమంత్రి కావాలని మొక్కిన మొక్కులను వారు ఇప్పుడు తీర్చుకున్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలసి నియోజకవర్గ నేతలు యద్దనపూడి బ్రహ్మరాజు, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి, లంకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాతల పేర్లు పెట్టడం హర్షణీయం

ఉంగుటూరు, జూలై 28 : ప్రభుత్వ పథకాలకు స్ఫూర్తి దాతల పేర్లు పెట్టడం హర్షణీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్ఫూర్తి దాతల పేర్ల వెనుక పవన్ కళ్యాణ్ ఆకాంక్ష ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్ము పంచి కుటుంబ సభ్యుల పేర్లు పెట్టడం ద్వారా పెత్తందారి విధానాన్ని అవలంబించారన్నారు. అనంతరం గణపవరం మండల రహదారుల దుస్థితిపై పంచాయతీరాజ్ డీఈఈ జీవీఎస్ఎన్ నాయుడితో చర్చించారు. మరమ్మతులు చేయించాలని సూచించారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, జూలై 28 : ప్రజా రోగ్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ఆరోగ్యం విషయంలో అలసత్వం ప్రదర్శించ కూడదని సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెంలో ఇటీవల మరణించిన మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పరసా సత్యరాజు కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కిలారు సేవలు ఆదర్శనీయం



కిలారును సత్కరించి మెమెంటో అందజేస్తున్న టీడీపీ శ్రేణులు

కామవరపుకోట, జూలై 28 మండల టీడీపీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న కిలారు సత్యనారాయణను పలువురు టీడీపీ శ్రేణులు ఆదివారం ఆయన నివాసంలో దుశ్శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. సత్యనారాయణకు ఆరోగ్యం సక్రమంగా లేకపోయినప్పటికీ క్రమశిక్షణతో, అంకిత భావంతో పార్టీ పురోభివృద్ధికి కృషి చేశారన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, బీసీ సెల్ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జి, టీడీపీ శ్రేణులు ఘంటా గోపీకృష్ణ, హాజీర్‌ఖాన్, డోలా విజయ్, పొదిల జేమ్స్, కూచింపూడి గణేష్, పొదిల వెంకటేష్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ మంత్రి రంగారావు

ఏలూరు రూరల్, జూలై 28: ప్రతి విద్యార్థి లక్ష్య సాధనలో ఇష్టపడి, కష్టపడి చదివితే విజయం సాధ్యమవుతుందని మాజీ మంత్రి మరడాని రంగారావు అన్నారు. డి.ఏలూరు పట్టణ కొప్పుల వెలమ కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘ భవనంలో అధ్యక్షుడు భీమవరపు పాపారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన సంఘీయుల్లోని పేద విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రంగారావు విద్యార్థులకు రూ.నాలుగు వేల చొప్పున ప్రతిభా పురస్కారంతో పాటు ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి మరడాని అచ్యుతరావు, మూడేళ్ల రంగారావు, బళ్ళా శివప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌కు అభినందన



కృష్ణతేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూలై 28: పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కృష్ణతేజను మంగళగిరిలో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు కడలి గోపాలరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పిల్లి వెంకట సత్యరాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం గోపాలరావు, సత్యరాజు మాట్లాడుతూ ఇటీవల గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు విడుదల చేయడంతో పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం సర్పంచ్‌లు, ప్రజల్లో కలిగిందన్నారు. మళ్ళీ పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయని వారు పేర్కొన్నారు.

చదవడం మాకిష్టం

పెదవేగి, జూలై 28 : పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం అలవడుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయానికి రావాలని, అప్పుడే విజ్ఞానం సొంతమవుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** స్థానిక రెండో డివిజన్‌లోని నాగేశ్వరపురం చెరువు గట్టు వద్ద గల గణేష్‌కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు, స్వామివారికి వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి అలంకారం జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ ప్రాంతవాసులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.
- స్థానిక బావిశెట్టివారిపేట రామానగర్ కాలనీలో గల శ్రీ భూలోకమ్మవారికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనాకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఆషాఢం సారెను సమర్పించారు. భక్తుల భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
- **దెందులూరు :** కనకదుర్గమ్మ తల్లికి రామదండు ఆధ్వర్యంలో ఆషాడం సారే అందజేశారు, మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు
- **పెదవేగి :** రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.59,455లు, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.33,780లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.4550లు ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.10,784లు విరాళాలు అందించారన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థాన కమిటీ మాజీ సభ్యుడు కర్పూరం గవరయ్య గుప్తా (నాని)ను ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించినట్లు ఆయన ఆదివారం తెలిపారు.
- **ఉంగుటూరు :** చేబ్రోలు రైల్వే అండర్ పాస్ నిర్మాణకర్త దాత దివంగత బూరుగుపల్లి ఆంజనేయులుకు నివాళులర్పించారు. మానవత చైర్మెన్ గుణ్ణం బుల్లెబ్బాయి అధ్యక్షతన ఆదివాకం సమావేశం జరుగగా ఆంజనేయులు కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.
- **టి.నరసాపురం :** మండలంలో ఆరు వేల గేదెలకు జబ్బవాపు రాకుండా ఐదు వేల ఆవులకు బొబ్బచర్మ వ్యాధి సోకకుండా టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కష్టకాలం

- పొంగుతున్న కొండ వాగులు
- నిత్యావసరాల కోసం గిరిజనుల అవస్థలు



నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకుని వాగు దాటుతున్న కొండరెడ్లు

బుట్టాయగూడెం, జూలై 28 : పశ్చిమ ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న అడవి బిడ్డలు నిత్యావసర సరుకుల కావాలంటే వర్షాకాలంలో కొండవాగులు దాటవలసిందే. లేకుంటే కుటుంబంలో పస్తులు తప్పవు. దట్టమైన అటవీ ప్రాంతంలో నివాసముంటున్న కొండరెడ్లు వర్షాకాలం వచ్చిందంటే కొండవాగులతో జీవన పోరాటం చేస్తుంటారు. ఏ చిన్న అవసరం వచ్చినా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయం గుప్పెట్లో వాగులను దాటుతూ ప్రయాణం చేయాలి. వర్షాకాలం ప్రారంభమైందంటే వీరికి కష్ట కాలం వచ్చినట్లే. దట్టమైన అటవీ ప్రాంతంలో పాపికొండల సమీపంలో ఉంటున్న మోదేలు కొండరెడ్ల కష్టాలు చెప్పనలవికావు. ఏది కావాలన్నా మండల కేంద్రం బుట్టాయగూడెం రావాలి. లేదా దొరమామిడి చేరుకోవాలి. ఏజెన్సీలో జరిగే వారపు సంతల్లో వారానికి సరిపడ నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుని కొండరెడ్లు తీసుకు వెళుతుంటారు. ఇదే క్రమంలో మోదేలు గ్రామానికి చెందిన కొండరెడ్లు నిత్యావసర సరుకుల కోసం దొరమామిడిలో జరిగే వారపు సంతకు వచ్చి సరుకులను కొనుగోలు చేసుకుని పీకల్లోతు వస్తున్న జల్లేరు కొండవాగును దాటి ఇళ్ళకు చేరుకున్నారు. ఇదే వాగును మోదేలు రెడ్లు ఎనిమిది సార్లు దాటవలసి ఉంటుంది. చిన్నచిన్న కాలువలు అనేకం ఉంటాయి. వాగులు దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగితే మరణమే. వర్షా కాలం నాలుగు నెలలు వీరికి నరకప్రాయమే. ప్రతీ వారం ఇదే పోరాటం. వాగులపై వంతెలను కాకపోయినా కనీసం లోలెవల్ కల్వర్టులు నిర్మించినా కొంత వరకు కష్టాలు తీరతాయని కొండరెడ్లు, న్యూడెమోక్రసీ నాయకుడు కారం రాఘవ ఐటీడీఏ అధికారులను కోరుతున్నారు.

మెరుగైన సంబంధాలు ఉండాలి : ఎమ్మెల్యే సొంగా



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, జూలై 28: గోద్రెజ్ కంపెనీ పామాయిల్ రైతులకు మధ్య మెరుగైన సంబంధాలు ఉండాలని, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు ప్రగడవరంలో కంపెనీ సమాధాన్ కార్యాలయం వద్ద ఆదివారం పామాయిల్ మొక్కలు పంపిణీ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, అందుకు ఈ కంపెనీ లారీలు ఎక్కువగా తిరగటం కూడా కారణమన్నారు. దీనికి బాధ్యత వహించి, రోడ్ల అభివృద్ధిలో సహకరించాలన్నారు. పామాయిల్ టన్ను రూ.17 వేల నుంచి రూ.20 వేలకు పెంచడానికి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కృషి చేస్తున్నారని, ఇప్పటికే పొగాకు విషయంలో విజయం సాధించారని తెలిపారు. కొందరు రైతులు మాట్లాడుతూ కంపెనీ ఆరు గంటలు దాటితే తమ లారీలను అనుమతించటం లేదని, రోడ్డు బాగోక ట్రాక్టర్లు ఆలస్యంగా వెళుతుంటే వాటిని లోపలికి కూడా రానివ్వడం లేదని, రైతులకు కనీసం మంచి నీరు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యాజమాన్యం రైతులకు అందించే సేవలు తెలియ చేయాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం రెండు, మూడేళ్లలో పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. అనంతరం కంపెనీ ఇచ్చిన మొక్కలను రైతులను అందజేశారు. ఫ్యాక్టరీ జనరల్ మేనేజరు మహంతి, రైతులు గోపి, నాయినబాబు, సీహెచ్.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ, పార్టీ నాయకులు కె.రాజారెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమంతోనే గ్రామ వికాసం



కొవ్వాక కాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూలై 28 : రైతుల సంక్షేమంతోనే గ్రామాలు వికసిస్తాయని, దీనికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొప్పుల వారిగూడెం రెగ్యులేటర్ ద్వారా దెందులూరు, ఏలూరు రూరల్ గ్రామాలకు, అంకన్నగూడెం స్లూయిజ్ ద్వారా కొవ్వాక కాలువ నుంచి పెదవేగి, పెదపాడు మండలాల్లోని గ్రామాల పరిధిలోని పంట భూములకు శనివారం రాత్రి ఎమ్మెల్యే ప్రభాకర్ సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించాలనే లక్ష్యంతో ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. 2017లో సీఎంగా ఉన్న చంద్రబాబు కృషి ఫలితమే పట్టిసీమ ఎత్తిపోతల పథకమన్నారు. కొప్పులవారి గూడెం రెగ్యులేటర్, అంకన్నగూడెం స్లూయిజ్‌ల ద్వారా నియోజకవర్గంలో దాదాపు 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు. మరో తొమ్మిదివేల ఎకరాల్లో చేపల చెరువులకు నీరందుతుం దని ప్రభాకర్ వివరించారు. పోలవరం కుడికాలువ ఏఈ లలితాదేవి, దెందులూరు ఏఈ కిషోర్, కృష్ణాకెనాల్ ఏఈ సుబ్రహ్మణ్యం, రవికుమార్, ప్రసాద్, టీడీపీ నాయకులు బి.సుధాకర్, టి.సత్యనారాయణ, ఎ.వెంకటనారాయణ, చిట్టియ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



తాడువాయిలో మొక్కలు నాటుతున్న సుబ్బారావు

కామవరపుకోట, జూలై 28 : మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అంకిత భావంతో కృషి చేయాలని మానవత నాయకులు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పిలుపు నిచ్చారు. ఆదివారం సాగిపాడులోని రత్నగిరినగర్‌లోని రత్నతులసిదేవి అమ్మవారి ఆలయ ప్రాం గణంలో ఆదివారం మొక్కలు నాటి. ఇంటింటికి మొక్కలను అందజేశారు.

ముళ్లపూడి సేవలు చిరస్మరణీయం

జంగారెడ్డిగూడెం, జూలై 28 : గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక వెలుగులు నింపి వేలాది మందికి ఉపాధి చూపిన గొప్ప ఆంధ్రాషుగర్స్ అధినేత డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ సేవలు చిరస్మరణీయమని తాడువాయి ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ ఇన్‌చార్జి రాయుడు సుబ్బారావు అన్నారు. డాక్టర్ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 104వ జయంతి సందర్భంగా తాడువాయి ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ యూనిట్-2లో ఆదివారం మొక్కలు నాటారు. ఆయన జయంతి సందర్భంగా శ్రీహరిశ్చంద్ర హరిత వన పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలి



ఏలూరులో కేంద్ర బడ్జెట్‌కు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 28 : కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం జరిగిందంటూ సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరు నగరంలోని వసంత మహల్ సెంటర్ పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో నాయకులు, కార్యకర్తలు కేంద్ర బడ్జెట్ ప్రతులను చించివేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడ్జెట్‌కు నిరసనగా నినాదాలతో హోరెత్తించారు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు కె.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, ఆర్.రామ్మోహన్‌రావు, పి.పెంటయ్య, జి.ప్రభాకర్, ఆర్.కిషోర్, డి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : వ్యవసాయరంగానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఏపీ రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎం.నాగులపల్లిలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకుని రావాలని రైతు రుణాలు మాఫీ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీపై కోత విధించడం అన్యాయమన్నారు. రైతుల ఆకాంక్ష మేర బడ్జెట్ లేదన్నారు. కార్యక్రమంలో బోయపాటి సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

300 ఎకరాలకు నీరులేక..

- పాలగూడెంలో ఎండుతున్న పంట భూములు
- ఆందోళనలో అన్నదాతలు



నీరు అందక బీటలు వారిన నారు మడులు

ఏలూరు రూరల్, జూలై 28:ఏలూరు రూరల్ మం డలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వరినారుమడులకు పుష్కలంగా నీరు అందింది. రైతులు హర్షం ప్రకటిస్తున్నా అయితే రూరల్ మండలం లోని పాలగూడెంలో పంట పొలాల్లో నీరు రాకపోవడంతో నారుమడులు, పంట పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి పెట్టామని, కాని నీరు రాకపోవడంతో ఏం చేయాలో అర్థం కాక కాలువవైపు చూస్తున్నామంటున్నారు. పాలగూడెంలో వెయ్యి ఎకరాలకు నారుమళ్ళు పూర్తి అయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సుమారు 700 ఎకరాలకు పుష్కలంగా వర్షపునీరు వచ్చి చేరింది. ఇదే క్రమంలో అదే గ్రామంలోని 300 ఎకరాలకు పైగా సాగునీరు అందక బీటలు వారి వరినారుమళ్ళు ఎండిపోయే దృష్టికి వచ్చాయి. కృష్ణాడెల్టా నుండి సాగునీరు రాకపోవడంతో ఆయకట్టులో పొలాలు నెర్రలిస్తున్నాయి. పాలగూడెంలో ఎక్కువగా వర్షాధారంతో పాటు కృష్ణాకాలువ పై ఆధారపడి వరిపంటను సాగుచేస్తూ ఉంటారు. ఇప్పటికే వరినారుమళ్ళు పోసిన పొలాలు నీరు అందక ఎండిపోతున్న పరిస్థితి అన్నదాతల్లో కలవర పెడుతోంది. సుమారు 700 ఎకరాలకు వర్షానికి నీరుచేరి రైతుల్లో ఆనందం ఉండగా, మరో 300 ఎకరాల్లో నీరులేక పంట పొలాలు నెరలు చాస్తూ ఉండటంతో పంట సాగుకోసం పెట్టిన పెట్టుబడి కూడా చేజారిపోతుం దోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలి

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలి. జిల్లాలో అతివృష్టి మరోవైపు అనావృష్టి పరిస్థితులు ఉన్నాయి. అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణాడెల్టా పరిధిలోని ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లోని భూములకు సాగునీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయి. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి పంటలు కాపాడాలి. సాగునీరు అందించే విషయంలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

- శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

నిరంతర శ్రమతోనే ఉత్తమ ఫలితాలు

పెదపాడు, జూలై 28 :ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో నిరంతరం శ్రమించాలని, అప్పుడే లక్ష్య సాధన సాధ్యమవుతుందని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ అన్నారు. వట్లూరులోని కళాశా లలో ఆదివారం మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. 2020-24 బ్యాచ్‌లో వివిధ విభాగాల్లో అకడమిక్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.25 వేలు, మరికొందరికి ల్యాప్‌టాప్‌లు, వికలాంగులు, క్రీడా, ఎన్‌సీసీ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి స్కాలర్ షిప్ చెక్కులు కళాశాల ఛైర్మన్ కె.వేణుగోపాల్ చేతుల మీదుగా అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మురళీధరరావు, డీన్ డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ చిరంజీవి, ఇంటర్నల్ ఎఫైర్ డీన్ డాక్టరు ప్రసాద్‌బాబు పాల్గొన్నా రు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

పెదపాడు, జూలై 28 : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, డ్రెయిన్లు, రహదారుల వెంబడి వర్షపు నీరు, మురుగు నీరు నిలిచిపోవడంతో దోమల ఉధృతి పెరిగిపోయింది. దోమకాటుతో వ్యాధుల బారినపడే ప్రమాదముందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని నివారణకు పంచాయతీలు దోమల మందు ఫాగింగ్ చేయడం ద్వారా దోమల ఉధృతి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

బురదలో దిగబడుతున్న వాహనాలు



బుట్టాయగూడెం, జూలై 27 : ఏజెన్సీలో వర్షాలు తగ్గినా కొండ వాగుల్లో ఊట నీరు ప్రవహిస్తూనే ఉంది. దీంతో గండ్లు పడిన చోట ప్రజలు మట్టిని పోసుకున్నా నీరు ప్రవహించడంతో వాహనాలు వెళ్ళేటపుడు మట్టి నానిపోయి దిగబడిపోతున్నాయి. బూరుగువాడ-వేపులపాడు గ్రామాల మధ్య ఉన్న బూరుగువాడ కొండవాగు పొంగడంతో గ్రామం సమీపంలోని వంతెన వద్ద గండి పడింది. వర్షాలు తగ్గడంతో సర్పంచ్ ఆధ్వర్యం లో గ్రామస్థులు మట్టితో గండిని పూడ్చారు. జామాయిల్ కర్రలు, పామా యిల్ గెలల లోడుతో ఉన్న బరువైన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్ళడంతో నీరు ప్రవహిస్తున్నందున మట్టి నీటితో మెత్తబడిపోయి వాహనాలు వెళ్ళినపుడు దిగబడిపోతుంది. అధికారులు స్పందించి గండిపడిన ప్రాంతంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

విద్యుత్ పునరుద్ధరణ



విద్యుత్ సరఫరా పునరుద్ధరణను పర్యవేక్షిస్తున్న రాధాకృష్ణ

వేలేరుపాడు, జూలై 28: పెదవాగు వరదల కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోవడంతో సోందే గొల్లగూడెం గ్రామానికి పది రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రత్యేక దృష్టి సారించి ఆ గ్రామానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది అతి కష్టం మీద 1.5 కిలోమీటర్ల విద్యుత్ స్తంభాలు నిలబెట్టి లైన్ వేసి రెండు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి ఆదివారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను అందించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ దగ్గరుండి పనులు వేగంగా జరిగేలా చూడడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కామవరపుకోట, జూలై 28 :ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు చాట్ల పుల్లారావు, కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఆదివారం ఏఐటీయూసీ ఆయాల సంఘ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఆయాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాయితీలు చెల్లించాలని, జీవో నెంబర్ 108 ప్రకారం ఆయాలకు వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. టీవీఎస్ రాజు, డి.భవాని, కె.విమల, ఎం.మంగ, పద్మ, పి.నిర్మల, లక్ష్మీకాంతం, ఎం.దుర్గ, పుల్లమ్మ పాల్గొన్నారు.

హరిదాసుల ప్రదర్శన

ఏలూరు కార్పొరేషన్, జూలై 28 : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావాలని, నేటి తరానికి పురాతన సంప్రదాయాలు తెలియచేయాలనే లక్ష్యంతో ఏలూరు ఇస్కాన్ అధ్యక్షులు రాధ వల్లభ ప్రభుజీ, తిరుప్పాణీయం-నిత్యదాసు ప్రతినిధులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో సత్కారాలు నిర్వహించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. స్థానిక హేలాపురి లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో 12 మంది ఆళ్వార్‌లలో ఒకరైన తిరుప్పాణాళ్వార్ వారి పరంపరగా తంబూర, చిరుతల వాయిద్య సహకారంతో సంకీర్తనా గానం చేశారు. ఎన్నో వందల సంవత్సరాలుగా వైష్ణవ ప్రచారం చేసి వీరంతా తమ ఆహ్వానం మేరకు రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 300 మంది విచ్చేసి జగన్నాథ రథత్సవంలో పాల్గొనడం విశేషమని ప్రభూజి తెలిపారు. ఆదివారం ఈ బృందానికి సత్కారాలు జరిపి ఆహ్లాదకరంగా ప్రదర్శనలు నిర్వహించారు.

రోడ్డుపై అడ్డుగా పడిన చెట్టు

కామవరపుకోట, జూలై 28 : ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులోని తడికలపూడి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఒక భారీ వృక్షం ఆదివారం వీచిన గాలులకు నేలకొరిగింది. దీంతో తడికలపూడి ఎస్ఐ తక్షణమే స్పందించి ఆర్అండ్‌బీ ఉద్యోగులను అప్రమత్తం చేసి పడిన చెట్టును తొలగించడంతో గంట పాటు స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

లక్కవరంలో ముస్లిం ధార్మిక సభ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న షేక్ ముస్తఫా, నాయకులు

జంగారెడ్డిగూడెం, జూలై 28 : లక్కవరంలోని ఫారూఖీ మసీదు కమిటీ అధ్యక్షుడు పఠాన్ అన్వర్ బాషా అధ్యక్షతన ఆదివారం ముస్లీం ధార్మిక సభ (ఇస్లామీ జల్సా ఇస్తెమా) జరిగింది. యువత సన్మార్గంలో నడవాలంటే ఆధ్యాత్మికతతో పాటు, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని పలువురు ముస్లిం ఆధ్యాత్మిక గురువులు సూచించారు. అనంతరం మసీదు ఇమామ్ అఫ్రోజ్ ఖాన్ శిక్షణనిచ్చిన 35 మంది విద్యార్థులు అరబ్బీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ ముస్తఫా బహుమతులను అందజేశారు. ముఫ్తీ, రహ్మతుల్లా, సిరాజ్, ఎస్కే ఫకీర్‌షా, నాసిర్, ఇమామ్, లాల్‌షా, హుస్సేన్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించండి

ఏలూరు క్రైం, జూలై 28 : రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో జీవించాలని ఎవరైనా ప్రజా శాంతికి భంగం కల్గిస్తే సహించేది లేదని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ ఎం.ప్రభాకర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదే శాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ రౌడీషీటర్లుగా ఉంటే సమాజం లో వారి కుటుంబానికి గౌరవం ఉండదని, పిల్లల భవిష్యత్తుకు తీరని భంగం వాటి ల్లుతుందన్నారు. ఎవరైనా గొడవలకు వెళ్ళడం, కేసుల్లో ఇరుక్కోవడంతో కుటుంబం కూడా నాశనం అవుతుందన్నారు. సత్ ప్రవర్తన కల్గిన వారిపై రౌడీషీటు తొలగించ డానికి ఉన్నతాధికారులకు సిఫారస్సు చేస్తామని వెల్లడించారు.

154 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ఆరోగ్య సలహాలు ఇస్తున్న వైద్యురాలు

ఏలూరు కార్పొరేషన్, జూలై 28 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామకోటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో హైద రాబాదుకు చెందిన ఏవీఎస్ ఆస్పత్రి వైద్యులు 154 మందికి వెరికోసిస్ వ్యాధి పరీక్షలు నిర్వహించి మందు లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మానేపల్లి రామారావు, నాయకులు పి.పండరీనాథ్, బి.సురే ష్, సీహెచ్ వెంకట్రామయ్య తదితరులు సేవలు అందించారు. అలాగే స్థానిక అమీనాపేటలోని మాధురి హాస్పటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహిం చారు. మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వై.శ్రీరామ్, వైద్యురాలు మాధురి, రాణి, శైలజ, కృష్ణవంశీ హాజరయ్యారు.

సుమోటో సర్టిఫికెట్లు విషయంలో ఒత్తిడి తగదు

ఏలూరు రూరల్, జూలై 28: గ్రామ రెవెన్యూ అధికారులకు అసంబద్ధత డేటాతో సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు చేయాలని, కౌలు కార్డుల టార్గెట్లు పూర్తి చేయాలని ఒత్తిడి చేయటం తగదని, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజురవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో ఖండించారు. పంచాయతీకి సంబంధించిన ఓడీఎఫ్ పల్స్ సర్వే పేరుతో కొంతమంది ఎంపీడీవోలు, వీఆర్వోలకు డ్యూటీలు వేస్తూ టార్గెట్‌లు ఫిక్స్ చేస్తున్నారన్నారు. ఇతర శాఖలకు సంబంధించిన విధులు వీఆర్వోలకు చెప్పకుండా సీసీఎల్ఏ నుంచి అన్ని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు గతంలో ఇచ్చినా జిల్లా అధికారులు పాటించడం లేదన్నారు. దీని వల్ల వీఆర్వోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామని హెచ్చరించారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు రూరల్, జూలై 28: స్థానిక వెంకన్నచెరువు సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్‌లైన్లు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నటరాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం సెంటర్, ఏడు కాలువల సెంటర్, చాటపర్రు రోడ్డు, తూర్పువీధి సాయిబాబా గుడి, గంగానమ్మ ఆలయం, ఫిల్ హౌస్ పేట, వీవర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం, కందకం రోడ్డు, దక్షిణపు వీధి, సదరన్ స్ట్రీట్, శెనగపప్పు బజారులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆగస్ట్ 18 నుంచి తీజ్ మహోత్సవం

ఏలూరు రూరల్, జూలై 28: బంజారా భజిరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దత్తాశ్రమం వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో ఆదివారం తీజ్ మహోత్సవం, ప్రచార పోస్టర్‌ను, కరపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కో కన్వీనర్ బోడా విమలావతిబాయి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బంజారా సంస్కృతి ప్రకృతి సిద్ధమైన పండుగలతో శాస్త్రీయమైన ఆలోచనలతో మిళితమై ఉంటుం దన్నారు. బంజారా ఆడపిల్లల కలల పండుగే తీజ్ మహోత్సవం అన్నారు. ఆగస్ట్ 18 నుంచి 26 వరకు రాష్ట్రమంతా తొమ్మిది రోజుల పాటు ఉత్సవం నిర్వహి స్తామన్నారు. రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాస్, జి.కృష్ణ, డి.సూరజ్, బూక్యా జ్యోతి, శ్రీఅక్షర, గాయత్రి, హిమజ తదితరులు పాల్గొన్నారు.

తెల్లారిన బతుకులు

ముగ్గురు కుమారుల మృతి.. తల్లి పరిస్థితి విషమం

- కాకినాడ జిల్లా మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం !
- తాడేరు గ్రామస్థుల దుర్మరణం


తల్లి దుర్గ

గండేపల్లి, జూలై 28: కూలి పనులు చేసుకుంటే కానీ పూటగడవని కుటుంబాన్ని మృత్యువు కబళించేసింది. కూలి పనులకు వెళ్లి తిరిగి సొంతూరుకు వస్తుండగా మృత్యువు గుర్తుతెలియని వాహన రూపంలో వచ్చి ముగ్గురినీ బలితీసుకోగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. వివరాలివి.. భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) సొంతూరులో ఉపాధి లేక అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా కుంతలం గ్రామానికి ఈనెల 17న ఉపాధి నిమిత్తం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లారు. అక్కడ పది రోజులపాటు పనిచేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30కు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్‌బైక్‌పై బయలుదేరారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారునకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. అప్పటికే చినుకులు పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా గుర్తుతెలియని వాహనం వారి మీద నుంచి వెళ్లిపోయినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈ విషయం హైవే మొబైల్ సిబ్బంది రాముకు తెలియగానే గండేపల్లి ఎస్ఐ ఎస్.రామకృష్ణ, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందించారు. హుటాహుటిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన దుర్గను 108లో రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి ప్రమాద ఘటనపై సమాచారం సేకరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృతి చెందడంతో ఆ దారిలో వెళ్లేవారిని సైతం కంటతడి పెట్టించింది.

ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నాం : జగ్గంపేట సీఐ లక్ష్మణరావు

ఈ ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ వేగవంతం చేశాం. పల్సర్ బైక్ వర్షానికి అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండవచ్చు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. త్వరగా విచారణ చేసి వాహనాన్ని పట్టుకుంటామని, జాతీయరహదారి వెంబడి సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు.


తాడేరులో బాధితుల ఇల్లు

తాడేరులో విషాదం

భీమవరం రూరల్, జూలై 28: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారులో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమారులు, వారి తల్లికి గాయాలైన ఘటనతో భీమవరం రూరల్ తాడేరులో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన నంగలం కోటయ్య కుటుంబం కాయకష్టాన్ని నమ్ముకుంది. ఎక్కువగా తాపీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. 365 రోజుల పాటు ఎక్కడ ఏపని ఉన్నా ఆ కుటుంబం వెళ్లిపోతోంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లి పది రోజుల అనంతరం శనివారం రాత్రి తాడేరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈసారి కోటయ్య మినహా భార్య దుర్గ, ముగ్గురు కుమారులు నర్సీపట్నం వెళ్లారు. రెప్పపాటులో తనువు చాలించారు. కోటయ్య భార్య దుర్గ గాయాలపాలైంది. ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోతున్నారు. చిన్నకుమారుడు అఖిల్ భీమవరంలోని గునుపూడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను పని వద్దకు తీసుకుపోతుంటారు. ఈసారి పాఠశాలకు వెళ్లకుండా అఖిల్ తన తల్లి దుర్గతో నర్సీపట్నం వెళ్లి ప్రమాదంలో దుర్మరణం పొందాడు. తల్లిదండ్రులు కోటయ్య, దుర్గలకు తీరని కడుపుకోత మిగిలింది. పాఠశాలకు వెళ్లి ఉంటే అఖిల్ ప్రాణాలతో మిగిలేవాడంటూ తాతయ్య నంగలం కృష్ణమూర్తి కన్నీటి పర్యంత మవుతున్నారు.


మృతుల ఇంటి వద్ద స్థానికులు, బంధువులు

చేతికి అందిన మనుమలు ఇక లేరు



ఈ వయస్సులో ఇలాంటి సంఘటన చోటుచేసుకుంది. చేతికి వచ్చిన మనవళ్ళు ముగ్గురు చనిపోవటం మా కుటుంబాన్ని కుంగిపోయాలే చేసింది. మాకు ఆదరించే వారు లేకుండా పోయారు.

\- కృష్ణమూర్తి, తాత

ఇంటికోసం ఎంతో కష్టపడతారు



పిల్లలు చదువులు మానేసి కష్టపడడం మొదులు పెట్టారు. ఇల్లు కట్టుకోవాలని కుటుంబంఅంతా దురప్రాంతం వెళ్ళి మరి కష్టపడేవారు. పిల్లలు ముగ్గురు మరణించడం ఎంతో బాధగా ఉంది. ఈ మధ్యనే వారికి ప్రభుత్వం ఇంటి స్థలం కూడా ఇచ్చింది.

\- పాపాయమ్మ, చిన నానమ్మ

కుటుంబం లేకుండా పోయింది..



అనుకోని సంఘటనతో కుటుంబం చిన్నాభిన్నమైంది. ఈ ప్రమాదంతో కుటుంబం అనేది లేకుండాపోయింది. జీవితం ఎలా గడుస్తుందో తెలియడం లేదు. ఉపాధికోసం కుంటుంబం అంతా దూరప్రాంతాలకు వెళ్లి పని చేసుకుని వచ్చే వాళ్లం. ఈసారి వారు వెళ్లారు.. నేను ఇక్కడే ఉండిపోయాను.

\- కోటయ్య, మృతుల తండ్రి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్వచ్ఛ నీరు అందించారు..



మునునూరు, జూలై 28: కలుషి నీరు.. అధ్వాన పారిశుద్ధ్యం శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురి తమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సచివాలయ గ్రేడ్-5 డీడీవో సూర్య నారాయణ ఆధ్వర్యంలో సూరేపల్లి గొల్లగూడెం కాలనీలో ఉన్న పైప్‌లైన్ లీక్‌లను మరమ్మతులు చేసి, మంచినీటి సరఫరా ట్యాంక్‌లను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయడంతో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయింది. అలాగే కాలనీలో చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లారు. మురుగు, వర్షపు నీరు పోయేలా డ్రెయినేజీల్లో సిల్ట్ తొలిగించారు. కాలనీలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. అక్కడక్కడ సాధారణ జ్వరాలు ఉన్నట్లు వైద్యాధికారి కరీముల్లా తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని డీడీవో సూర్యనారాయణ తెలిపారు.

రహదారులకు గ్రోవెల్ మరమ్మతులు



ముదినేపల్లి, జూలై 28 : శ్రీహరిపురం నుంచి వడాలి శివారు వరకు వర్షాలకు ధ్వంసమైన ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతులను సింగరాయపాలెంలోని గ్రోవెల్ ఫీడ్స్ కంపెనీ చేపట్టింది. 'నరకానికి నకళ్ళు' శీర్షికన వడాలి సెంటర్‌లో నెలకొన్న ప్రమాదకర స్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన కంపెనీ యాజమాన్యం గోతులను పూడ్చే పనులను శనివారం ప్రారంభించింది. శ్రీహరిపురం నుంచి సుమారు 4 కిలోమీటర్లు రహదారిని అభివృద్ధి చేయనున్నారు. కంపెనీ ప్రతినిధులతోపాటు టీడీపీ నాయకుడు వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడి ఫిర్యాదుతో.. బుసక తవ్వకాలకు బ్రేక్

ముదినేపల్లి, జూలై 28 : బుసక తవ్వకాల పేరుతో పచ్చని పొలాలు చేపల చెరువులుగా మారిపోతున్నాయి. ముదినేపల్లి మండలంలో ఇటీవల కాలంలో ఇవి మరింత యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. తాజాగా ముదినేపల్లి మండలం ప్రొద్దువాక రెవెన్యూ గ్రామ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన బుసక తవ్వకాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఆ పొలంలో తవ్వకాలను చేపట్టగా, జనసేన నాయకుడి ఫిర్యాదు మేరకు అధికారులు శనివారం సాయంత్రం నిలిపివేశారు. కైకలూరు ప్రాంతంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు బుసక సరఫరా చేసేందుకు ఇద్దరు కాంట్రాక్టర్లు ప్రొద్దువాక గ్రామ పరిధిలోని ఆ భూమిలో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు ప్రారంభించారు. అయితే ఆ నాలుగు ఎకరాల విస్తీర్ణాన్ని చేపల చెరువుగా మార్చి అప్పచెప్పటం రైతులకు, కాంట్రాక్టర్లకు మధ్య ఏర్పడిన ఒప్పందం. ఈ మేరకు తవ్వకాలు ప్రారంభించి బుసకను హైవే పనులకు టిప్పర్లతో రవాణా చేసే సందర్భంలో ఆ భూముల్లో అనుమతులు లేకుండా చేపల చెరువులు తవ్వుతున్నారని దేవపూడికి చెందిన జనసేన నాయకుడితో పాటు కొందరు రైతులు ముదినేపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే రెవెన్యూ సిబ్బంది తవ్వకాలను నిలుపుదల చేయించారు. తవ్వకాలకు అనుమతులు లేవని గుర్తించామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.



దాత సహకారంతో రహదారి మరమ్మతులు

కైకలూరు జూలై 28: కైకలూరు పట్టణంలోని ప్రధాన రహదారి మరమ్మతులను ఆదివారం మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో పట్టణంలోనే ప్రధాన రహదారి అయిన కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో దుకాణాల సముదాయం వద్ద గోతులు ఏర్పడి వర్షపునీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఇప్పుడే నిధులు వచ్చే పరిస్థితి లేనందున ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచనల మేరకు రహదారి మరమ్మతులు నిర్వహించారు. దాతకు పలువురు అభినందనలు తెలిపారు.


చెక్కులు అందజేస్తున్న మానవత

పేదల విద్యాభివృద్ధికి 'మానవత' ముందు

కైకలూరు, జూలై 28: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మానవత ఎప్పుడూ ముందుంటుందని సంస్థ అధ్యక్షురాలు కొండ్రెడ్డి చిట్టెమ్మ అన్నారు. ఆదివారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించా రు. 110 మందికి బ్లడ్ గ్రూపు పరీక్షలు, 15 మందికి కిడ్నీ వ్యాధుల పరీక్షలను నిర్వహించారు. అనంతరం 25 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.7,500 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అలాగే ఐదుగురు వృద్ధులకు వైద్యం కోసం ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. మానవత సభ్యు లు కొండ్రెడ్డి సత్యనారాయణ, గుర్రం శ్యాంకుమార్, శివ, శీలం కృష్ణవేణి, ఎంవీవీ సత్యనారాయణ, బెల్లాని శ్యామలరావు, గాలిబ్ బాబు తదితరులు పాల్గొన్నారు.


కోరుకొల్లులో కొత్తగా తవ్విన తాగునీటి చెరువు

యుద్ధప్రాతిపదికన చెరువు తవ్వకం

కలిదిండి, జూలై 28 : కోరుకొల్లులో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన తాగునీటి చెరువు తవ్వకం పనులు త్వరితగతిన పూర్తి చేశారు. గత నెలలో తాగునీటి చెరువు తవ్వకాల పనులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. కొత్తగా తవ్విన చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నింపి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు. చెరువు తవ్వకం పనులకు సహకరించిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, గ్రామస్థులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య.. 10 లోపే!

- పది మంది కన్నా తక్కువ విద్యార్థులున్న పాఠశాలల గుర్తింపు
- ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు డీఈవో ఆదేశాలు

ముదినేపల్లి, జూలై 28 : 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఆయా పాఠశాలల పరిధిలో బడి ఈడు పిల్లలను నూరు శాతం బడుల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం నుంచి మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం పది మంది లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలల జాబితాలను కూడా ఎంఈవోలకు అందజేశారు. కైకలూరు నియోజకవర్గంలో 35 ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది లోపు విద్యార్థులున్నట్లు గుర్తించారు. ఇద్దరు, ముగ్గురు, నలుగురు విద్యార్థులున్న పాఠశాలలు మనుగడ కొనసాగించాలంటే విద్యార్థుల సంఖ్యను పది మందికిపైగా పెంచాలన్నది విద్యాశాఖ ఉన్నతాధికారుల ఉద్దేశం.



10 మంది విద్యార్థుల లోపు ఉన్న పెదగొన్నూరు ప్రాథమిక పాఠశాల

ముదినేపల్లి మండలంలో 13, మండవల్లి 5, కలిదిండి 8, కైకలూరు మండలంలో 9 ప్రాథమిక పాఠశాలల్లో పది కన్నా తక్కువ సంఖ్యలో విద్యార్థులున్నట్టు గుర్తించారు. ముదినేపల్లి మండలంలో ప్రొద్దువాక శివారు బొబ్బిలిగూడెం, వాడవల్లి శివారు బొబ్బిగూడెం, బొమ్మినంపాడు, నరసన్నపాలెం, పెద కామనపూడి, పెదగొన్నూరు, ప్రొద్దుటూరు, ప్రొద్దువాక-1, సీతారామపురం, తేరగూడెం, ఉప్పరగూడెం, ఊటుకూరు, వడాలి-2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పది మంది కన్నా తక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించారు. పై పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సాగు, తాగు నీరివ్వడమే లక్ష్యం : మంత్రి సారథి


తమ్మిలేరు ప్రాజెక్టు కుడికాలువ గేటు ఎత్తుతున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి, జూలై 28: ప్రతి ఎకరాకు సాగు నీరు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మంత్రితో పాటు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, టీడీపీ నాయకులు, రైతులు పూజలు చేసి తమ్మిలేరు ప్రాజెక్టు కుడికాలువ గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల, తమ్మిలేరు మరమ్మతులు పూర్తి చేస్తామని, కూటమి పాలనలో వ్యవసాయానికి మహర్దశ రానున్నదని అన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టుపై ఇరిగేషన్ అధికారులను మంత్రి వివరాలు అడగగా, ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.9 టీఎంసీలు నీరు ఉన్నదని, ఇరిగేషన్ లెవల్ 1.2 టీఎంసీలు అని ప్రాజెక్టు కింద అధికారిక ఆయకట్టు 9,200 ఎకరాలు ఉన్నదని, చింతలపూడి ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు ప్రాజెక్టుకు అనుసంధానం చేయటానికి డిజైన్ చేశారని ఈఈ దేవప్రకాష్, డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ పరమానందం వివరించారు. ఇరిగేషన్ అధికారులతో మంత్రి మాట్లాడుతూ ప్రాజెక్టుపై పైలట్ ప్రాజెక్టు నిర్మించి చాట్రాయి మండలంలో 18 పంచాయతీలకు తాగునీరివ్వడానికి అంచనాలు రూపొందించాలని, కుడికాలువ నీరు ముసునూరు మండలం సూరేపల్లికి అందించటానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం మంకొల్లు గ్రామస్థుల సమస్యలను మంత్రి తెలుసుకున్నారు. చీపురుగూడెంలో అనారోగ్యానికి గురైన టీడీపీ మండల నాయకుడు బొట్టు లక్ష్మణరావు సతీమణి శకుంతలాదేవిని మంత్రి పరామర్శించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


చాట్రాయి మండలం మర్రిబంధంలో..

చారు మజుందార్‌కు ఘన నివాళి

చాట్రాయి, జూలై 28: మర్రిబంధం గ్రామంలో నక్సల్బరీ నిర్మాత చారు మజుందార్ వర్ధంతిని, సీపీఐ (ఎంయల్) లిబరేషన్ 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు లబ్ధి చేకూరింది కానీ రైతులకు వ్యవసాయ కూలీలకు ఒరిగిందేమీ లేదన్నారు. లిబరేషన్ నాయకులు హెచ్చు రాజేంద్రప్రసాద్, తగరం తిరుపతిరావు, జయరాజు, లాజరు తదితరులు పాల్గొన్నారు.


ముసునూరు మండలంలో నినాదాలు చేస్తున్న లిబరేషన్ నాయకులు

ముసునూరు: నక్సలైట్ ఉద్యమానికి ఆద్యుడు చారు మజుందార్ అని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య నివాళులర్పించారు. ఆదివారం మజుందార్ వర్ధంతిని, లిబరేషన్ పార్టీ 50వ వ్యవస్థాపక దినోత్సవాన్ని లిబరేషన్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్కపల్లి, రమణక్కపేట, గుడిపాడు తదితర గ్రామాల్లో లిబరేషన్ నాయకులు బక్కయ్య, కిసాన్ మహాసభ అధ్యక్షుడు పామర్తి రామారావు మజుందార్ చిత్రపటానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. తక్షణమే 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లిబరేషన్ నాయకులు ఆముదాల చినబాబు, వేముల చంటి, పల్లిపాము భవాని తదితరులు పాల్గొన్నారు.

నిద్రలోనే అనంతలోకాలకు..

ముదినేపల్లి, జూలై 28 : పంచాయతీ విధులు నిర్వహించి ఇంటికి వచ్చి నిద్రించిన ఓ కాంట్రాక్టు ఉద్యోగి నిద్రలోనే చనిపోయిన ఘటన ముదినేపల్లి మండలం దాకరం గ్రామంలో జరిగింది. ముదినేపల్లి పంచాయతీ చెత్త సేకరణ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న పరసా శ్రీరాములు (65) భార్య ఆరు నెలల క్రితం మరణించగా, శ్రీరాములు ముదినేపల్లి నుంచి దాకరం వచ్చి ఒంటరిగా ఉంటున్నాడు. శనివారం రాత్రి భోంచేసి నిద్రపోయిన అతడిని లేపేందుకు ఆదివారం తెల్లవారుజామున పక్కింటి వారు ప్రయత్నించగా, శ్రీరాములు అప్పటికే విగతజీవుడైనట్టు గుర్తించారు. శ్రీరాములు మృతి పట్ల ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, కార్యదర్శి జి.రమేష్ సంతాపం తెలిపి అతని అంత్యక్రియలకు పంచాయతీ తరపున రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు.

చేప బెల్లం ద్రావణంపై అవగాహన

ముదినేపల్లి, జూలై 28 : ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు ఆదివారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలో చేప బెల్లం ద్రావణం తయారీపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మండల ప్రకృతి వ్యవసాయ విభాగ ఇన్‌చార్జ్ గౌతం కుమార్ ఆధ్వర్యంలో ద్రావణం తయారు చేసి ఉపయోగాలను వివరించారు. పది కేజీల చేపల వ్యర్థాలను, పది కేజీల నల్లబెల్లంతో కలిపి 11 రోజులపాటు డబ్బాలో నిల్వ చేసుకోవాలని, అనంతరం జల్లెడ పట్టి ద్రావణాన్ని తీయాలని తెలిపారు. పావు లీటరు ద్రావణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి ఎకరం విస్తీర్ణంలో వరికి, కూరగాయల పంటలు, ఇతర పండ్ల తోటలకు పిచికారీ చేస్తే పైరు ఎదుగుదలకు ఉపకరిస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఇష్టాగోష్ఠిలో పాల్గొన్న భక్తులు

రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

కైకలూరు, జూలై 28: పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం కైకలూరు శ్రీరామకృష్ణ సేవా సమితిలో సాహితీవేత్త చింతపల్లి వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఇష్టాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సమాజమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఐక్యవేదిక సభ్యులు శేషు, ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావు, జి. విజయ గణేష్, పి. సీతారామరాజు, పి. వినయకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడుపల్లి నారాయణరావుకు మంత్రి నివాళి


నారాయణరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, జూలై 28: ఆగిరిపల్లి వైశ్య ప్రముఖుడు మడుపల్లి నారాయణరావు మృతదేహాన్ని మంత్రి పార్థసారథి ఆదివారం నాడు సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంతిమయాత్రలోను పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నారాయణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఒక సామాన్యుడు అసామాన్యుడిగా ఎలా ఎదగవచ్చో నారాయణరావు జీవితం ఉదాహరణ అన్నారు. నారాయణరావు మృతికి సంతాప సూచకంగా ఆగిరిపల్లిలోని వ్యాపార వర్గాలు ఆదివారం నాడు దుకాణాలు మూసివేశాయి.

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జూలై 28: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మంగళవారం రాత్రి వరకు ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ట్రావెలర్స్ బంగ్లాకు చేరుకుంటారు. రాత్రి వరకు బంగ్లాలోనే ప్రజలకు అందుబాటులో ఉంటారు. అలాగే మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు బంగ్లాలోనే అందుబాటులో ఉంటారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్ర రాంబాబు మృతి



ముసునూరు, జూలై 28: గోపవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్ర రాంబాబు (58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. జిల్లా పరిషత్ ఏర్పడిన తరువాత టీడీపీ నుంచి జడ్పీటీసీగా విజయం సాధించి, ముసునూరు మండల అభివృద్ధితోపాటు పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, మాజీ సర్పంచ్ ఉండవల్లి ధర్మరాజు, యువనేత ఉప్పలపాటి గణేష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గుడపాటి అజయ్‌కుమార్ తదితరులు రాంబాబు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలు వేసి, నివాళులర్పించారు. రాంబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు యువనేత గణేష్ అందజేశారు.



మూల్లంక పెద్దింటమ్మకు సారె సమర్పణ

కలిదిండి, జూలై 28 : మూల్లంకలో పెద్దింటమ్మకు మహిళలు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, పాడి పంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆలయ చైర్మన్ తమ్మినీడు నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


దాత బోడావుల నాంచారయ్యను సన్మానిస్తున్న కూటమి నేతలు

గ్రామస్థుల సహకారంతో అన్న క్యాంటీన్

కైకలూరు జూలై 28 : ఆచవరం గ్రామ టీడీపీ నాయకుల ఆర్థిక సాయంతో ఆదివారం కైకలూరు తాలుకా సెంటర్లోని అన్న క్యాంటీన్ వద్ద 400 మంది పేదలకు అన్నదానం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరుణంలో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌లో ప్రతి రోజూ ఓ దాత సహకారంతో భోజనాలు అందిస్తున్నారు. 40 రోజుల పాటు నిర్విరామంగా నడిపిన ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు పేదలు అభినందనలు తెలిపారు. ఆచవరం టీడీపీ నాయకులు బోడావుల నాంచారయ్య, పి. రాధాకృష్ణ, ఏకుల కృష్ణయ్య, నాగనబోయిన నాంచారయ్య, కూటమి నాయకులు మంగినేని రామకృష్ణ, వీరాబత్తిన సుధా, కొల్లి వరప్రసాద్, లక్కింశెట్టి మోహన్, కంచర్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.